క్లుప్తంగా

జేఈఈ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందన



మణీందర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

తర్లుపాడు: జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 10వ ర్యాంక్ సాధించిన తర్లుపాడు మండలం గొల్లపల్లికి చెందిన యక్కంటి వెంకటమణీందర్‌రెడ్డిని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. తెలంగాణలో నిర్వహించిన ఎంసెట్ ఫలితాల్లో 2వ, ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో 7వ ర్యాంకు సాధించినట్లు ఎమ్మెల్యేకు మణీందర్‌రెడ్డి వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగన్, రామిరెడ్డి, విద్యార్థి తండ్రి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

మంత్రి సురేష్ చొరవతో బోరు ఏర్పాటు



చెంచులు ఆనందంగా పట్టుకుంటున్న నీరు

పుల్లలచెరువు: సమస్య చెప్పిందే తడవుగా మంత్రి చేసి చూపారు. మండలంలోని కొమరోలు పంచాయతీ పరిధి చెంచుకాలనీలో నీటి సమస్య ఉందని చెంచులు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో శనివారం మంచినీటి బోరు ఏర్పాటు చేయించారు. బోరులో సంమృద్ధిగా నీరు పడటంతో తమకు మంచినీటి సమస్య తీరిందని చెంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెంచులు మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఎంఈఓ-2ను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు

కురిచేడు: మండలానికి బదిలీపై వచ్చిన ఎంఈఓ-2 సీహెచ్ సుబ్బారావును ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం ఎమ్మార్సీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సుబ్బారావును కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీఎల్ సుబ్బారావు, షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా కార్యదర్శి సీహెచ్ శివ రామకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయులు పచ్చ పూర్ణ చంద్రరావు, పి.నజీర్, షేక్ మహబూబ్ బాషా, మహితేజ ఉన్నారు.

గిద్దలూరు ఎస్ఐగా మహేష్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఎస్ఐగా వి.మహేష్ బదిలీ అయ్యారు. ఎస్పీ మలికాగర్గ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. గిద్దలూరులో పని చేస్తున్న బ్రహ్మనాయుడును ఒంగోలు సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాచర్ల ఎస్ఐగా పనిచేస్తున్న మహేష్‌ను నియమించారు.

ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు: రైతులు పీఎం కిసాన్ రైతు భరోసా కోసం తమ పేరు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 10551 మంది రైతులు అర్హత ఉండగా ఇప్పటి వరకు 8441 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని పేర్కొన్నారు. మిగిలిన 2110 మంది రైతులు తమ పేర్లను బయోమెట్రిక్ ద్వారా మీ సేవా కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలతో ఈకేవైసీలో నమోదు చేసుకోవాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కొనకనమిట్ల తహసీల్దార్

కొనకనమిట్ల: మండల తహసీల్దార్‌గా బీఆర్ఎల్‌వీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌ను పీసీపల్లి మండలానికి బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

దొనకొండ: దొనకొండ తహసీల్దార్‌గా ఎం.సువర్ణ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె యర్రగొండపాలెం మండల ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ దొనకొండకు బదిలీపై వచ్చారు. గతంలో పని చేసిన తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు దర్శి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. తాను అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని సువర్ణ తెలిపారు.

రైల్వే డబుల్ లైన్‌కు స్థల పరిశీలన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు, పాములపల్లె గేటు సమీపంలో రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ విజయకుమారితో కలిసి మార్కాపురం సబ్‌కలెక్టర్ సేధు మాధవన్ పరిశీలించారు. రెవిన్యూ శాఖ పరిధిలోని కొండ పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న వారి వద్దకు వెళ్లి రైల్వే డబుల్ లైన్ పనులు ప్రారంభం కానున్నాయని, త్వరలో ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. రైల్వే అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. గృహాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు.

చేయూతతో మహిళల జీవితాల్లో వెలుగు

కురిచేడు: రాష్ట్రంలోని మహిళలు, చిరు వ్యాపారులు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడంలో ఆయనకు ఆయనే సాటి. ఒక కుటుంబంలోని వారు కూడా చూపనంత ప్రేమను రాష్ట్ర మహిళలపై ఆయన చూపుతున్నారు. నేడు ప్రతి ఇంట్లో అభం శుభం తెలియని చిన్నారులు సైతం జగన్ మామయ్య..అంటూ స్వచ్ఛమైన మనసుతో తమ హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రతి ఇంట్లో కొడుకుగా, అన్నగా, తమ్ముడిగా, మనవడిగా ఆయన స్థానం సంపాదించుకున్నారు. అందరూ బాగుండాలనే జిజ్ఞాసతో చేయూత పథకానికి శ్రీకారం చుట్టారు. ఎందరో చిరు వ్యాపారులు తమ బతుకులు బాగు చేసుకున్నారు. మూడు పూటలా పిడికెడు మెతుకులు ఆనందంగా తింటున్నారు. చేయూత అందిస్తుండటంతో మహిళలు స్వయం ఉపాధి వైపు బలంగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో కరోనా కష్టకాలంలో ఆ కుటుంబాలకు పెద్ద దిక్కుగా మహిళలు నిలిచారు. కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు, దుకాణాలు, పాడిపరిశ్రమ, చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ ముందుకు సాగుతున్నారు. తమ కుటుంబాలను ఎటువంటి బాదరబందీ లేకుండా పోషించుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడగలుతున్నారు. ప్రతి చిరువ్యాపారి, ప్రతి మహిళ ఎంతో ఆనందంతో తమకు తోబుట్టువులా వచ్చి ఆదుకున్నాడని ఆనంద పరవశంతో సీఎం వైఎస్ జగన్‌ను కొనియాడుతున్నారు.

1693 మందికి లబ్ధి

దర్శి నియోజకవర్గంలో చేయూత ద్వారా 1693 మంది లబ్ధి పొంది వారి జీవితాలను మెరుగుపరుచుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ ల ద్వారా దర్శి మండలంలో 457, దొనకొండ మండలంలో 336, కురిచేడు మండలంలో 267, ముండ్లమూరు మండలంలో 370, తాళ్లూరు మండలంలో 263 మంది లబ్ధి పొందారు.



కిరాణా వ్యాపారం చేస్తున్న మార్తమ్మ

నాపేరు కేసనపల్లి మార్తమ్మ. మాది కురిచేడు మండలం నమశ్శివాయపుర అగ్రహారం. చేదోడు పథకంతో మా జీవితాల్లో వెలుగులు నిండాయి. నిత్యం పొలం పనులు వెతుక్కునే మాకు నేడు వ్యాపారం చేసుకుంటూ ఇంటి పట్టునే ఉండి కుటుంబాన్ని పోషించుకునే ఆర్థిక స్థోమత కలిగింది. మా పిల్లలను పెద్ద చదువులు చదివించేదుకు కూడా మాకు మా అన్న జగన్‌మోహనరెడ్డి అండగా ఉన్నాడనే భరోసా కలిగింది. ఆయన మేలు మేము.. మా పిల్లలం మరువలేం. మా కుటుంబం మొత్తం ఆయనకు రుణపడి ఉంటాం.



నాపేరు పగడాల మల్లేశ్వరి. మా ఊర్లో పనులు లేనప్పుడు పక్క ఊళ్లకు పనులు వెతుక్కుంటూ వెళ్లే మాకు ఇప్పుడు అలాంటి అవసరం లేదు. చేయూత ద్వారా వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాకు సాయం చేస్తున్నారు. ఇంత వరకు ఏ నాయకుడూ చేయని విధంగా మాకు సాయం చేస్తున్నాడు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే ఆ కుటుంబం ఒడిదొడుకుల నుంచి బయట పడగలదని నిరూపిస్తున్నారు. ఆర్థిక స్థితిగతులు గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మా మహిళాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన మేలు మరువలేం . ఆయనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి.



అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

త్రిపురాంతకం: గ్రామాల అభివృద్ధికి అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలని పాలనను గ్రామాలకు అందుబాటులోకి తెచ్చారని వివరించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చి గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి కోరారు. ఎంపీడీఓ సాంబశివరావు మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయురెడ్డి మాట్లాడుతూ సాగర్ దిగువన పంట కాలువలు మరమ్మతులకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీటీసీ జ్యోతి ఉపాధి హామి పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించాలని మిరియంపల్లి, విశ్వనాథపురం సర్పంచ్‌లు సుధాకర్, రంగబాబు కోరారు. రోడ్లుకు ఇరువైపులా పిచ్చి, తుమ్మచెట్లు పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని ఎంపీటీసీ సుబ్బారావు కోరారు. రోడ్డు పక్కను పెరిగిన చెట్లు తొలగించాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీపీ వివరించారు. ఎంఈఓ తులసిమల్లికార్జున నాయక్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు జగనన్న కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. ఎంఈఓ-2 రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెండో ఎంఈఓను ఇచ్చి విద్యాశాఖను మరింత పటిష్టం చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు నాయక్ టీబీ, లెప్రసీ వంటి వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. పాడి రైతులు, పశువుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఏడీ సాంబశివరావు తెలిపారు. వ్యవసాయ సీజన్‌కు రైతులను సమాయత్తం చేస్తున్నట్లు వ్యవసాయాధికారి నీరజ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ ద్వారా అవసరమైన పనులు చేపడతామని ఏపీఓ సుజాత వివరించారు. ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు ఆయా శాఖల ఏఈలు వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ భ్రమరాంబ, ఉపాధ్యక్షులు సుబ్బమ్మ, రిబకమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బారెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన పొదిలి ఎంఈఓ-2



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగలక్ష్మి

పొదిలి రూరల్: మండల విద్యాశాఖాధికారి-2గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పేరం నాగలక్ష్మి శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి, సీఆర్పీలు గాదె వెంకట సుబ్బారెడ్డి, కుమార్ ఉన్నారు.

రెడ్డి కమ్యూనిటీ జిల్లా కార్యదర్శిగా మోహన్‌రెడ్డి



కర్నాటి మోహన్‌రెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ కర్నాటి మోహన్‌రెడ్డి రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.వెంకటేశ్వరరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఇతర రెడ్డి సంఘాలను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారం కోసం కష్టపడి పనిచేయనున్నట్లు మోహన్‌రెడ్డి తెలిపారు.

చిరు వ్యాపారుల ఆవేదన

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్‌లోని జాతీయ రహదారికి ఇరువైపులా తోపుడుబండ్లు పెట్టుకుని జీవనం చేసే చిరువ్యాపారులు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వద్ద ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్డుపై తోపుడుబండ్లు పెట్టుకోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని, పది రోజుల క్రితం హైవే నిర్వాహకులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో తోపుడుబండ్లను, ఆక్రమణలను కొంతమేర తొలగించారు. తమ జీవనోపాధి లేకుండపోయిందని, వ్యాపారాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ చిరువ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రత్యామ్నాయ మార్గం చూపాలని, రోడ్డు విస్తరణ చేసేంత వరకైనా రోడ్డు పక్కన తోపుడుబండ్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

జగనన్న సురక్షపై శిక్షణ

పుల్లలచెరువు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ దాసు అన్నారు. శుక్రవారం పుల్లలచెరువు సచివాలయం-1,2 పరిధిలోని గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఎంఎల్ఓ వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ దాసు మాట్లాడుతూ ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌరసేవలు అందించడమే జగనన్న సురక్ష ఉద్దేశమన్నారు. ఎంపీడీవో మరియదాసు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో శనివారం నుంచి ఇంటింటికీ ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వ పరంగా అవసరమయ్యే సేవలు తెలుసుకోవాలన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతి పంచాయతీలో రోజూ పంచాయతీలో అధికారులు బృందాలుగా ఏర్పడి 11 రకాల సేవలు అందించే బాధ్యత మనం దరిపై ఉందన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎంఎల్ఓ వాసు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లాజర్, ఈవోఆర్డీ బాలునాయక్, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు రఘు, ఎంపీటీసీ రాములు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

మార్కాపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి నుంచి సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, డీఈ సుభానీ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీ డ్వాక్రా బజారులో వార్డు వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వలంటీర్లందరూ సమన్వయంతో పని చేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అర్హత కలిగి ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేకపోయిన వారిని గుర్తించి దరఖాస్తు చేయించాలన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పొందవచ్చనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మున్సిపల్ చైర్మన్, అధికారులు

ఎమ్మెల్యేను కలిసిన ఎంఈఓలు

గిద్దలూరు రూరల్: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గిద్దలూరు-2 ఎంఈఓగా జింకా వెంకటేశ్వర్లు, కొమరోలు ఎంఈఓ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తులు

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9 తరగతులు, ఇంటర్మీడియెట్‌లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు సోమవారంలోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తామన్నారు.

విజయ్‌కుమార్‌కు సత్కారం

దర్శి: నేషనల్ సిట్టింగ్ వాలీబాల్‌కు ఎంపికైన వేల్పుల విజయ్‌కుమార్‌ను దర్శి తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దర్శికి చెందిన విజయ్ కుమార్ నేషన్ స్థాయిలో ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విజయ్‌కుమార్‌కు ఆర్థికంగా సహకారాలు అందించి ముందుకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. దళిత ప్రజాసంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, స్టీవెన్, సన్నీ పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పొదిలికి చెందిన ఉడుముల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.

నేడు పాలుట్లలో గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని చెప్పారు. ఉదయం 7 గంటలకు యర్రగొండపాలెంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాలు బయల్దేరుతాయని, 11 గంటలకు పాలుట్ల చేరి అక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని, అనంతరం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలి

కొనకనమిట్ల: విద్యార్థులు చదువులో రాణించేలా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఎంఈఓ ఎస్కే డాంగే షరీఫ్, ఎంపీటీసీ మీరావళి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సిద్ధవరం మండల పరిషత్ పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థికి అభినందన

నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన సిద్ధవరం ఏఏ పాఠశాల విద్యార్థిని గుడిమెట్ల ప్రసంగి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంఈఓ అభినందిచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియమ్మ, ఎంపీటీసీ మీరావళి, నరసింహరావు, పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు ఎస్‌కేజీ మస్తాన్ పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్‌కు సహకారం

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న నూతన కార్యవర్గం

పొదిలి రూరల్: చర్చి, పాస్టర్లు, సంఘ సభ్యుల సమస్యల పరిష్కారంలో అహరోను పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గానికి సహకారం అందిస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి కమ్యూనిటీ హాల్లో పొదిలి మండలం అహరోను పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం చేపట్టే ప్రతి పని పారదర్శకంగా ఉండాలన్నారు. శ్మశానవాటిక స్థలం, నూతన కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని నూతన కమిటీ కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గ ప్రెసిడెంట్‌గా తాళ్లూరి శాంసన్, వైస్ ప్రెసిడెంట్‌గా గర్నెపూడి ఎనోషు, సెక్రటరీగా అంబటి శ్యాంబాబు, జాయింట్ సెక్రటరీగా జగన్నాథం జాన్(నాగేశ్వరరావు), ట్రెజరర్‌గా కాటి జాన్‌వెస్లీ, ఈసీ మెంబర్లుగా తాళ్లూరి ఐజాక్, రాచపూడి వెంకట నర్సును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పులిగొర్ల శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు ముల్లా జాకీర్, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి మూలస్తంభాలు



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మూల స్తంభాలుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని ఎగ్గన్నపల్లెకు చెందిన కొప్పుల నరసింహులు అనే పార్టీ కార్యకర్త జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలని, అన్నా రాంబాబు తిరిగి ఎమ్మెల్యే కావాలని కోరుతూ శుక్రవారం ఇడుపులపాయ, తిరుమలకు గిద్దలూరు పట్టణం రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం అక్కడి నుంచి ఎమ్మెల్యే, నాయకులు వైఎస్సార్ విగ్రహం వరకు పాదయాత్ర చేస్తూ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాదయాత్రకు స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు సంఘీభావం తెలుపుతూ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగనన్నను ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. ప్రజల హృదయాల్లో చెరగని స్థానాన్ని దక్కించుకున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో ప్రజలు జగనన్నకు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. కార్యకర్తల్లో ఉన్న బలమైన నమ్మకం జగనన్నను తిరిగి సీఎంను చేస్తుందన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ వైఎస్సార్ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాదయాత్ర చేస్తున్న కార్యకర్త నరసింహులుకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. నరసింహులుతో పాటు మరో 20 మంది పాదయాత్ర చేయడం చాలా గొప్ప విషయమన్నారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు బాదం గోపాల్, ముద్దర్ల శ్రీనివాసులు, రమణారెడ్డి, బాల చెన్నయ్య పాల్గొన్నారు.

ఆనర్స్ డిగ్రీతో ఉద్యోగావకాశాలు



మార్కాపురం : మాట్లాడుతున్న రమేష్



పొదిలిలో ప్రొఫెసర్లను సత్కరిస్తున్న రమణారెడ్డి, వైవీ

మార్కాపురం: ఆనర్స్ డిగ్రీతో విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని స్థానిక ఐడీఎల్ అండ్ కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యక్కలి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు నూతనంగా అమల్లోకి వచ్చిన డిగ్రీ కోర్సులో చేరాలని సూచించారు. విద్యార్థులడిగిన సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల తలిదండ్రులతో పాటు అధ్యాపకులు ఉస్మాన్‌బాషా, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం నూతన విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు రాజగోపాల్, సోమశేఖర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉండేలా నూతన విద్యా విధానాన్ని రూపొందించారని పేర్కొన్నారు. ముందుగా ప్రొఫెసర్లను కళాశాల డైరెక్టర్లు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, అన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కురిచేడు: మండలంలోని పడమర గంగవరంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ 5వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ వీరగంథం కోటయ్య, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ గోగులముడి లింగారెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

బాబా మందిరానికి వెండి బిందె అందజేత

మార్కాపురం టౌన్: పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిర్డీ సాయి మందిరానికి అభిషేకం, పూజ నిమిత్తం భక్తులు పైడిమర్రి మురళి కుటుంబ సభ్యులు వెండి బిందెను మందిర కార్యదర్శి హరిహరరావుకు శుక్రవారం అందించారు. గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా గత వారం రోజుల నుంచి భక్తులతో మందిరంలో అఖండ పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆపన్నహస్తం

పుల్లలచెరువు: స్నేహితుని కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకుని ఆ కుటుంబానికి స్నేహితులు ఆపన్న హస్తం అందించారు. పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో 2003 బ్యాచ్, కొత్తూరు గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటయ్య మృతి చెందాడు. ఆ మరణవార్త విన్న ఆ బ్యాచ్‌కు చెందిన వెంకటయ్య మిత్రులు శనివారం ఆ కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపాలి

కొమరోలు: వరిపంటకు ప్రత్యామ్నాయంగా ఆపరాల పంటల సాగుపై ఆసక్తి చూపాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని ఇడమకల్లులో రైతులకు రైతు భరోసా కేంద్రం వద్ద ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాజశ్రీ, గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.